

టూరిజంపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్

మంత్రి నారా లోకేశ్ విశాఖ రాక



ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు పల్లా, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి విశాఖ చేరుకున్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చిన ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, ఉమ్మడి జిల్లా నాయకులు దాడి రత్నాకర్, మహ్మద్ నజీర్, సీతంరాజు సుధాకర్, కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు స్వాగతం పలికారు. లోకేశ్ విమానాశ్రయం నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. ఆయన శుక్రవారం కోర్టుకు హాజరవుతారు. శనివారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
మహర్షి వాల్మీకి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, కలెక్టరేట్, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి చిత్తడిగా మారిన పాడేరు అంబేద్కర్ సెంటర్



మన్యంలో ముసురు

పాడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం మన్యంలో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం పది గంటల తరువాత ఎండ కాసింది. అయితే మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఓ మోస్తరు వర్షం కురిసింది. వాస్తవానికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబంగా ప్రాంతాల్లో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడితే ఏజెన్సీలో వాటి ప్రభావం అధికంగా ఉంటుంది. తమిళనాడు ప్రాంతంలో తుపాన్‌లు ఏర్పడితే ఇక్కడ అంతగా ప్రభావం ఉండదు. అయితే ఈ ఏడాది అధికంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రస్తుతం భారీ వర్షాలు కురవకపోవడమే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మద్యం దుకాణాలకు అవాంతరాలు

జిల్లాలో మొత్తం 40 షాపులకు ప్రారంభమైనవి 12 మాత్రమే

- పాడేరు ఏజెన్సీ పరిధిలో వసతి సమస్యతో 10, రంప, చింతూరు ప్రాంతాల్లో గ్రామసభల తీర్మానాలు లేక 18 ప్రారంభంకాని వైనం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలకు ప్రారంభంలోనే అవాంతరాలు ఎదురయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 దుకాణాలకు గురువారం నాటికి కేవలం 12 షాపులు మాత్రమే ప్రారంభమయ్యాయి. మిగతావి కొన్ని చోట్ల వసతి సమస్య వల్ల, మరికొన్ని చోట్ల గ్రామసభల తీర్మానాలు లేక ప్రారంభానికి నోచుకోలేదు.



పాడేరులో మద్యం దుకాణం వద్ద రద్దీ

జిల్లాలోని పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10 షాపులు, అరకులోయలో 6, చింతపల్లిలో 6, రంపచోడవరంలో 10, చింతూరులో 8 మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా అమ్మకందారులను అధికారులు ఎంపిక చేశారు. కాగా పాడేరు ఏజెన్సీ పరిధిలో వసతి సమస్య వల్ల 10 షాపులు ప్రారంభంకాలేదు. రంప, చింతూరు ప్రాంతాల్లో దుకాణదారుడు షాపుతో పాటు గ్రామసభ ... మిగతా 8వ పేజీలో

ఏటా పర్యాటక ఉత్సవాలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

- పాడేరు, రంప ఏజెన్సీలో 15 సందర్శనీయ ప్రాంతాలను గుర్తించాలని సూచన
- డిసెంబరు మొదటి వారంలో అరకు ఉత్సవ్‌కు ప్రతిపాదనలు

పాడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని పాడేరు, రంపచోడవరం ఏజెన్సీలో ప్రతి ఏడాది టూరిజం సీజన్‌లో రెండు, మూడు రోజుల పాటు పర్యాటక ఉత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో టూరిజం అభివృద్ధిపై గురువారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా ప్రతి ఏడాది పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలని, ఇతర ప్రాంతాల గిరిజనుల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, పనిముట్లు, ఇతర వస్తువుల ప్రదర్శన, వినోద, సాహస క్రీడలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది డిసెంబరు మొదటి వారంలో అరకు ఉత్సవ్ నిర్వహణకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పర్యాటక ఉత్సవాల ద్వారా దేశ, విదేశాల దృష్టిని ఈ ప్రాంతం ఆకర్షించాలన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 10, రంపచోడవరం డివిజన్ పరిధిలో 5 ప్రముఖమైన పర్యాటక ప్రదేశాలను గుర్తించి, వాటిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. రంపచోడవరం ప్రాంతంలోని గుడిస పర్యాటక ప్రాంతం పారిశుధ్యం లోపించి అధ్వానంగా మారిందని, ఐటీడీఏ పీవో, డీఎఫ్‌వో దానిని సందర్శించి నివేదిక సమర్పించాలన్నారు. అలాగే పాడేరు మండలం వంజంగి హిల్స్‌ను ఐటీడీఏ పీవో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏజెన్సీలోని పర్యాటక ప్రదేశాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ, అటవీ, టూరిజం, స్థానిక సంఘాలతో కలిసి నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించాలన్నారు. ఆ ప్రణాళికను అమలు చేస్తూ పర్యాటక ప్రదేశాల్లో సంపూర్ణ సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు సందర్శకులు శతశాతం సంతృప్తి వ్యక్తం చేసేలా ఉండాలన్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, లీగల్ కమిటీ చైర్మన్‌గా సబ్ కలెక్టర్ వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. గుడిస, కటికి వంటి సందర్శనీయ ప్రదేశాల్లో ప్రైవేటు జీపు ఆపరేటర్ల దందాకు చెక్ పెట్టాలని, పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సింహాచలం, డీఎఫ్‌వో రవీంద్ర, టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా పర్యాటకాధికారి దాసు, గిరిజన మ్యూజియం మేనేజర్ మురళి పాల్గొన్నారు.

గిరిజన కాఫీ రైతులకు సంపూర్ణ ప్రోత్సాహం

- కలెక్టర్ ఏఎన్ దినేశ్‌కుమార్



గెడ్డంపుట్టులో ఏర్పాటు చేసిన కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
గిరిజన కాఫీ రైతులను సంపూర్ణంగా ప్రోత్సహిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గెడ్డంపుట్టు గ్రామంలో మన్యతోరణం రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ మార్కెటింగ్ విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన కాఫీని విస్తరించడానికి, ప్రమోట్ చేయడానికి 50 మంది గిరిజన యువకులకు శిక్షణ అందించాలన్నారు. కాఫీ ఉత్పత్తదారులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని, రైతులు పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చిన కాఫీ పండ్లను మాత్రమే సేకరించాలని కలెక్టర్ సూచించారు. గెడ్డంపుట్టులోని కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌లో కాఫీ పండ్ల పల్పింగ్, క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, కాఫీ పొడరు తయారీ, కాఫీ డికాక్షన్ తయారీలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కాఫీని రుచి చూసి తయారీదారులను అభినందించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు డీడీ ఎస్.రమేశ్, మన్యతోరణం రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ దూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగెడ్డలో నాటు పడవ మునక



గల్లంతైన వేణుగోపాల స్వామి (ఫైల్ ఫొటో)

- గిరిజన యువకుడి గల్లంతు



సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
మండలంలో గల దారెల పంచాయతీ పెద్దపేట గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డలో గురువారం ఓ నాటు పడవ మునిగిపోయింది. ఈ ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు నాటు పడవల సహాయంతో సాయంత్రం వరకు గాలించినా గల్లంతైన యువకుడి ఆచూకీ కానరాలేదు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన కొర్రా వేణుగోపాలస్వామి(24) వ్యవసాయ పనిముట్లు సాన బెట్టించుకొనేందుకు ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ పెద్దపేట గ్రామానికి నాటు పడవపై మత్స్యగెడ్డ దాటుతున్నాడు. పడవ గెడ్డ మధ్యలోకి వచ్చే సరికి నీట మునిగిపోయింది. అది గమనించిన స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొనే సరికే ఆ యువకుడు నీట మునిగిపోయాడు. నాటు పడవ గెడ్డలో తేలియాడుతూ కనిపించింది. గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం స్థానికులు నాటు పడవల సహాయంతో సంఘటన స్థలంలో సాయంత్రం వరకు గాలించారు. అయినా ఫలితం కనిపించలేదు. గల్లంతైన యువకుడికి రెండేళ్ల క్రితమే వివాహమైంది. విషయం తెలుసుకున్న ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల తహసీల్దార్లు నర్సమ్మ, రంగారావు, ఎస్ఐ కె.రవీంద్రలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. అయితే యువకుడి ఆచూకీ తెలియలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు.

కారు బోల్తా - 6లో

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

పీవీటీజీ తెగలకు 2,166 గృహాలు

- తొలి విడత 1,404 ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- హౌసింగ్ డీఈఈ రాజుబాబు



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ రాజుబాబు

అరకులోయ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
పీఎం జన్‌మన్ పథకం కింద మండలంలోని పీవీటీజీ తెగలకు 2,166 ఇళ్లు మంజూరయ్యాయని గృహ నిర్మాణ శాఖ అరకులోయ సబ్ డివిజన్ డీఈఈ రాజుబాబు తెలిపారు. గురువారం మండలంలో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలి విడతగా 1,404 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో ప్రారంభింపజేశామన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. సుంకరమెట్ట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పీవీటీజీ గ్రామాలైన పెదగంగగుడి, సంఘం వలస, డాబుగుడ, పిరిబంద గ్రామాల్లో గృహ నిర్మాణాలను పరిశీలించినట్టు ఆయన తెలిపారు. నిర్దిష్ట కాల వ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేస్తే వెంటనే బిల్లులు మంజూరు చేస్తామని లబ్ధిదారులకు ఆయన తెలిపారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించక ముందే ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడి ఖాతాలో రూ.70 వేలు జమ చేసిందని చెప్పారు. రెండవ విడతలో 762 ఇళ్లు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంటన సుంకరమెట్ట పంచాయతీ సర్పంచ్ చిన బాబు, ఏఈఈ కాంతి, తదితరులు వున్నారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఎలుగుబంటి దాడిలో గాయపడిన గిరి మహిళ

డుంబ్రిగుడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని పిత్తగుడ గ్రామంలో గురువారం ఎలుగుబంటి దాడి చేయడంతో ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలయ్యాయి. పిత్తగుడ గ్రామానికి చెందిన కిల్లో లక్ష్మి, కిల్లో కేశవరావు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గల కాఫీ తోటలో పని చేసేందుకు గురువారం ఉదయం వెళ్లారు. అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేయడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వారి కుటుంబీకులు వెంటనే అంబులెన్స్‌లో డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించినట్టు బాధిత కుటుంబాలు తెలిపాయి.

అరకువ్యాలీలో హెలీప్యాడ్ ఏర్పాటు చేయండి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

పాడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):
ప్రముఖ పర్యాటక ప్రాంతం అరకు వ్యాలీకి చేరుకోవడానికి పర్యాటకులకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ఆ ప్రాంతంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రితో ఎంపీ కలిశెట్టి గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అరకు వ్యాలీలో హెలీప్యాడ్ ఏర్పాటుతో సులభంగా ప్రయాణ సదుపాయాలు కల్పించవచ్చని, స్థానికులను ఆపద సమయాల్లో త్వరగా తరలించేందుకు, పర్యాటక వృద్ధికి తోడ్పడుతుందని సూచించారు. ఫలితంగా అరకు వ్యాలీ పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని కలిశెట్టి ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు.



కారు బోల్తా.. డ్రైవర్ మృతి


కాపలాల్లో బోల్తాపడిన కారు

ముంచంగిపుట్టు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అస్రాడ గ్రామ సమీపంలో గురువారం కారు బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ ఉమాశంకర్ (35) మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఒడిశాలోని కోరాపుట్టు జిల్లా బొయిపరిగూడ గ్రామానికి చెందిన నలుగురు ఆంధ్రాలోని జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టుకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. అస్రాడ మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. కారునడుపుతున్న డ్రైవర్ ఉమా శంకర్, మహంతితోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటీన అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో ఒడిశాలో ని లమ్‌తాపుట్టు ఆశాకిరణ్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ డ్రైవర్ మృతి చెందారు. కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

'నెరవేరనున్న ఆదివాసీల సొంతింటి కల'

చింతపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే ఆదివాసీలకు సొంతింటి కల నెరవేరిందని టీడీపీ నాయకుడు, లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ అన్నారు. గురువారం మండలంలోని చోడిరాయి, మేడూరు గ్రామాల్లో పీఎం జన్ మన్ పథకం ద్వారా మంజూరైన పక్కా గృహాల నిర్మాణాలను హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ రమణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతుగెడ్డ పంచాయతీలో 180 గృహాలకు పునాదులు పూర్తయ్యాయన్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.72 వేలు జమచేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబూరావు, హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ రమణ పాల్గొన్నారు.

ఆడాకుల గిరిజనేతరుల భూ సమస్యపై చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దారు కుమారస్వామి

కొయ్యూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ఆడాకులు గ్రామంలో గిరిజనేతరుల సాగులోఉన్న భూములపై స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఆదేశాల మేరకు అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్టు తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. ఆడాకులకు సంబంధించి 1936 నుంచి 25 కుటుంబాలకు చెందిన గిరిజనేతరుల సాగులో ఉన్న భూములకు ఆన్‌లైన్ చేసి ఈ పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని ఆయా రైతులు ఉన్నతాధికారులకు చేసుకున్న వినతి మేరకు 2023 జూలైలో ఎస్‌డీసీ గ్రామ సభ నిర్వహించినట్టు చెప్పారు. ఈ భూములపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టరు, జేసీ తదితరులు పరిశీలించారన్నారు. ఎస్‌డీసీ వీవీఎస్ సుబ్రమణ్యం గత జూన్ 20న ఇచ్చిన ఆదేశాల మేరకు ఆడాకులు పరిధిలో గల గిరిజనేతరుల భూములను చట్ట పరిధిలో వెబ్ నమోదుకు వివరాలను సంబంధిత పంచాయతీ, మండల కేంద్రంలో నోటీసు బోర్డులలోఉంచుతున్నామన్నారు. వీటిపైవచ్చిన అభ్యంతరాలను ఆధారాలతో తదుపరి చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

కొయ్యూరు ఎంపీడీవోగా రమేశ్‌నాయుడు


ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌నాయుడు

కొయ్యూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధిఅధికారిగా రమేశ్‌నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన మేరీరోస్ బదిలీపై అనకాపల్లి జిల్లా గొలుగొండ వెళ్లగా, సబ్బవరంనుంచి రమేష్‌నాయుడు కొయ్యూరు వచ్చారు.

'పాడేరు వైద్య కళాశాలకు మల్లుదొర పేరు పెట్టాలి'

కొయ్యూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) పాడేరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు స్వాతంత్ర్య సమరయోధుడు గాంమ ల్లుదొర పేరు పెట్టాలని భారతీయ ఆదివాసుల సమాఖ్య కార్యవర్గ సభ్యురాలు గడుతూరి రామలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్లుదొర స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సహచరునిగా ఖ్యాతి గడించారన్నారు. ఈ క్రమంలో బ్రిటీష్ సేనలకు పట్టుబడి అండమాన్ జైలు శిక్ష అనుభవించారన్నారు. స్వాతంత్ర్యానంతరం జైలు నుంచి విడుదలై 1952లో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ పార్లమెంట్ స్థానంనుంచి ఎన్నికయ్యారన్నారు. ఈ స్వాతంత్ర్య సమరయోధుని సేవలకు ప్రభుత్వాలు తగిన గౌరవం ఇవ్వలేదన్నారు. పాడేరులో కళాశాలకు మల్లుదొర పేరు పెట్టాలని రామలక్ష్మి డిమాండ్ చేశారు.

'అల్లూరి జిల్లాకు నిధులు కేటాయించాలి'

అనంతగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అభివృద్ధి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని స్థానిక జడ్పీటీసీ గంగరాజు, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య అన్నారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఆగస్టులో గ్రామ సభలను నిర్వహించి, ఉపాధి పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారన్నారు. అయితే, అల్లూరి జిల్లా మినహాయించి మిగిలిన జిల్లాలకు రూ.2712 కోట్లు కేటాయించడంపై వారుఅభ్యంతరం తెలిపారు.

రేషన్ కోసం కొండ ఎక్కాల్సిందే..!

ఫోన్ సిగ్నల్స్‌లేక గిరిపుత్రుల అవస్థలు

'చెట్టులెక్కగలవా.. ఓ నరహరి పుట్టలెక్కగలవా'.. అంటూ ఏదో సినిమాలో హీరోని ఆటపట్టించే సన్నివేశం ఇప్పుడు గిరిజనులకు నిత్యకృత్యమైంది. రేషన్ సరకులు కావాలన్నా.. ఎవరికైనా ఫోన్ చేయాలన్నా సిగ్నల్స్ కోసం చెట్లు, పుట్టలు.. కొండలు పట్టుకుతిరగాల్సి వస్తోంది. సాంకేతిక ఎంతో పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లోనూ ఈ దుస్థితిపై గిరిజనులు మండిపడుతున్నారు.


రేషన్ సరకుల కోసం నిరీక్షిస్తున్న చుట్టుమెట్ట గ్రామస్థులు

జి. మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చుట్టుమెట్ట కాలనీకి ఫోన్ సిగ్నల్స్ అందక అవస్థలు ఎదుర్కొంటున్నట్టు స్థానికులు వాపోతున్నారు.

మండల కేంద్రం సమీపాన ఉన్నా బీఎస్ఎన్ఎల్, జియో సిగ్నల్స్ సక్రమంగా రాక వివిధ ప్రభుత్వ పథకాల బయోమెట్రిక్ నమోదుకు గంటల సమయం నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో ప్రతి నెలా రేషన్ సరకులు తీసుకునేందుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కొండలపైకి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీనికితోడు గ్రామంలో కనీస రహదారి సౌకర్యం లేక, తాగునీటి సదుపాయం ఉంటుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఫోన్ మాట్లాడాలంటే 15 కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది.

సీలేరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి), జీకేవీధి మండల పరిధి గాలికొండ పంచాయతీ పరిదిలోని సప్పర్ల గ్రామంలో గల బీఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ గత 45 రోజులుగా పనిచేయక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా ఎవరికైనా ఫోన్ చేయాలంటే 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధారకొండ, లేదా గూడెంకొత్తవీధి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన చెందుతున్నారు. మారుమూల గ్రామాలకు ధృకృథంతో కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సెల్ టవర్‌కు సాంకేతిక సమస్య తలెత్తినా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సప్పర్ల గ్రామంలో సెల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.


సప్పర్లలో పనిచేయని బీఎస్ఎన్ఎల్ టవర్

మేఘమాల..


చింతాలమ్మ ఏడొంపుల ఘాట్‌లో మేఘాలు

కొయ్యూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చింతాలమ్మ ఏడొంపుల ఘాట్‌లో గురువారం మధ్యాహ్నం ప్రకృతి దృశ్యం కనువిందు చేసింది. కొండలపైనుంచి మేఘాలు నింగిని తాకుతూ తెల్లటి పాలనురగ మధ్య ప్రయాణం సాగించేలా దర్శనమిచ్చాయి. ఈ మార్గంలో ప్రయాణించిన వారికి చక్కటి అనుభూతినిచ్చాయి.

రాష్ట్ర స్థాయి క్రీడలకు బాయ్స్-2 స్కూల్ విద్యార్థి ఎంపిక


చిన్నారి చిరుతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదబయలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలుర- 2లో తొమ్మిదో తరగతి చదువుతున్న కిల్లో చిరుత అండర్ -14 కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం శెట్టి మూర్తి తెలిపారు. ఈ నెల 16న అనకాపల్లి జిల్లా వేములపూడి జడ్పీ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) చిరుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారిని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎమ్ అనంతరావు, ఫిజికల్ డైరెక్టర్ కోటేశ్వరరావు,ఉపాధ్యాయులు జగన్నాయ్, దీక్షపతి,రమేశ్ ,చిరంజీవి తదితరులు అభినందించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

పాడేరురూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ అధిపతి టీఎస్ రసూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి మాట్లాడుతూ..వాల్మీకి వృత్తాంతం, రామాయణంలో వ్యక్తిత్వ వికాసాన్ని, ఆదికావ్యం, సుందరకాండ ప్రాశస్త్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.సునీతదేవి, ఎం.రాధాకుమారి, గోవిందరాజులు, నిర్మలదేవి, వారిజా, గౌరీశంకరరావు, అప్పలనాయుడు, కొత్తంనాయుడు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోఎంఈవో ఎస్. విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు వన్నెపూరి భీమ్‌నాయుడు, కేజే రామారావు, ప్రసాదరావు, కన్నయ్య, కేశవ, కేశవరావు, దిలీప్‌కుమార్, కొండబాబు, రాజేష్, మహేశ్వరి, గంగాభవాని, వసంతకుమారి, పుణ్యవతి, అరుణ పాల్గొన్నారు.

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండలో గురువారం ఘనంగా వాల్మీకి జయంతి నిర్వహించారు. స్థానిక సీతారాముల ఆలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ నడిగట్ల రాజు ముఖ్య అతిథి పాల్గొని, వాల్మీకి చిత్రపటానికి పూలమాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణాన్ని వాల్మీకి చిరస్థాయి కీర్తిని గడించారని వివరించారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ అల్లూరి జిల్లా సంయోజక్ గొర్లి గణేశ్వరరాజు, మండల సంయోజక్ కొర్రా రాము, మాజీ సర్పంచ్ గొర్లి రాజుయేసువరరాజు, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, తదితరులు

అపెక్స్ కమిటీ నిర్ణయించిన ధరకే కాఫీ కొనుగోలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ వెంకటేష్

పాడేరురూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాఫీ సాగు రైతులు కాఫీ పంట సేకరణపై అవగాహన పెంపొందుకుని అధిక లాభాలను పొందాలని జీపీసీఎం సొసైటీ బ్రాంచి మేనేజర్ వెంకటేష్ సూచించారు. మండలంలోని వంజంగిపంచాయతీ దొడ్డిపల్లి, బొర్రమామిడి గ్రామాల్లో గురువారం రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. కాఫీ పంట కోత విధానంలోని మెలకువలను వివరించారు. అపెక్స్ కమిటీ సమావేశంలో ప్రకటించిన గిట్టుబాటు ధరలు పార్చిమెంట్ కాఫీకి కిలో రూ. 285, అరబిక్ చెర్రీ కిల్లో రూ. 150, రోబోస్ట చెర్రీ కిలో రూ. 80 లకు జీసీసీ నుంచి కొనుగోలు చేస్తామన్నారు. దళారుల చేతిలో మోసపోకుండా రైతులు కాఫీని జీసీసీకి, కాఫీ పండ్లను ఐటీడీఏకు విక్రయించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు కాఫీని ఆరబెట్టేందుకు టార్పాలిన్లు, కాఫీ పండ్ల పల్పింగ్‌కు పల్పర్లను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ కాఫీ ఏఈవో అప్పలనాయుడు, జీసీసీ సిబ్బంది, ఎఫ్‌సీఎస్, లైజన్ వర్కర్లు, వంజంగి మాజీ సర్పంచ్ కాదెలి రంగమ్మ, దొడ్డిపల్లి, బొర్రమామిడి కాఫీ రైతులు పాల్గొన్నారు.

నేడు పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏపీఎస్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు మండలంలోని వంట్లమామిడి ఫీడర్‌లో నిర్వహణ పనులతో వంట్లమామిడి, కోట్లగరువు, కందమామిడి బంగారుమెట్ట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే పెదబయలు మండల పరిధిలోని రూడకోట, గోమంగి, కుమడ, జామిగూడ గ్రామాలకు, అనంతగిరి మండల పరిధిలోని బీసుపురం, మరదగూడ, లక్ష్మీపురం, దిగువశోభ, చిలకలగెడ్డ, కాశీపట్నం, ఎన్ఆర్.పురం గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడు లేని పాఠశాల!

- పనసపుట్టులో రెండు నెలలుగా దుస్థితి
- సెలవుపై వెళ్లిన ఉపాధ్యాయుడు.. మరొకరిని నియమించని అధికారులు


పాఠశాల ఎదుట కుర్చున్న చిన్నారులు

డుంబ్రిగుడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైగండ పంచాయతీలో పనసపుట్టు గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుడు కోసం ఎదురుచూస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు రెండు నెలల కిందట వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. అప్పటినుంచి రోజూ బడికి వస్తున్న చిన్నారులకు చదువు చెప్పేవారు కరువయ్యారు. దీంతో ఉదయం వెళ్లిన చిన్నారులు మధ్యాహ్నం భోజనంతో సరి పెట్టుకుని ఇళ్లకు చేరుతున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచి శాంతి మాట్లాడుతూ రెండు నెలల కిందట ఉపాధ్యాయుడు వ్యక్తిగత సెలవులపై వెళ్లిపోయారన్నారు. ఈవిషయంపై స్థానిక ఎంఈవో, గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి దృష్టికి తీసువచ్చామన్నారు. వారు ఉపాధ్యాయుడిని అదనంగా ఏర్పాటు చేస్తామని చెప్పినా ఆ హామీ అమలు కాలేదన్నారు. చిన్నారులు చదువుకు దూరం కావడం బాధాకరమన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చిన్నారులు భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు: సీఐ


ములియగుడ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న సీఐ హిమగిరి, ఎస్ఐ శ్రీనివాసరావు,

అనంతగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని అరకు సీఐ హిమగిరి హెచ్చరించారు. మండలంలోని ములియగుడ వద్ద గురువారం అనంతగిరి ఎస్ఐ డి. శ్రీనివాసరావుతో కలిసి వాహనాల తనిఖీ చేశారు. అనుమానితులను క్షుణంగా పరిశీలించి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహన రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఘాట్‌రోడ్డుపై మీతిమీరిన వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని వాహనదారులకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు

పాడేరురూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చేందుకు పల్లె పండగ కార్యక్రమం దోహదపడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు అన్నారు. గురువారం వంట్లమామిడి, దేవాపురం, సలుగు, ఐనాడ పంచాయతీలలో ఆయా పంచాయతీల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అల్లూరి జిల్లాకు ప్రత్యేక నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారన్నారు. వంట్లమామిడిలో రూ. 3 లక్షలు, సలుగులో రూ. 6 లక్షలు, దేవాపురంలో రూ. 4 లక్షలు, ఐనాడ పంచాయతీలో రూ. 5 లక్షలతో ట్రెంచ్ వర్కులు చేసేందుకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వంట్లమామిడి సర్పంచ్ పాంగి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు తోకల ఈశ్వరరావు, సలుగు సర్పంచ్ గెమ్మెలి అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు దూసూరు మీన, ఐనాడ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు, గంగరాజు, ఎడ్ల అప్పారావు, జి.కొండబాబు, ఎ.సోముకేశ్వరరావు, వి.సురేంద్ర, ఉపాధి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జోరుగా పల్లెపండుగ

అరకులోయ: మండలంలో పల్లెపండుగ కార్యక్రమం జోరుగా సాగుతోంది. గురువార గన్నెలలో వాన నీటి సరక్షణ పనులకు రూ. 76 వేలు, రూ.45 వేలతో ఫారం ఫాండ్ రూ.9 లక్షలతో మట్టిరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇకగాయాలో క్యాటిల్‌షెడ్, సీసీరోడ్డు, లోతేరు రోడ్ నుంచి ఉరుములు వరకు సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ఉదయ్‌భాస్కర్, సర్పంచ్‌లు బొజ్జ మాస్టారు, బుట్కి తదితరులు పాల్గొన్నారు.

రూ. 4.84లక్షలతో అభివృద్ధి పనులు


పల్లెపండుగలో బొర్రా నాగరాజు, అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ కొత్తూరు గ్రామంలో రూ.4.84లక్షలతో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు ఎంపీడీవో శ్రీసాయి హర్ష తెలిపారు. గురువారం కొత్తూరులో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మణ్, కూటమి నేతలు కె.బలరాం, ఎం.చిన్నిబాబు, లక్ష్మణ్, బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

ఒంబి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

డుంబ్రిగుడ: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కంద్రుం పంచాయతీ ఒంబి గ్రామంలో డబ్ల్యూ బీఎం రోడ్డు నిర్మాణ పనులకు టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి ఎస్ దోన్నుదొర గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఎం. స్వామి, జనసేన పార్టీ నాయకులు, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్

రాజ్‌మా సాగులో తెగుళ్ల నివారణ చర్యలు తప్పనిసరి

జి.మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజ్‌మా సాగులో తెగుళ్ల నివారణ చర్యలు తప్పక పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. ప్రదీప్‌కుమార్ సూచించారు. మండలంలోని జి.మాడుగుల గ్రామంలో గురువారం రాజ్‌మా సాగును సందర్శించి పరిశీలించారు. ఈ సాగులో రసం పీల్చే పురుగుల ఉత్పత్తిని గమనించారు. వాటి నివారణ చర్యల నిమిత్తం వేపనూనె పిచికారీ చేయాలని సూచనలు చేశారు. అలాగే పసుపు జరుగు అట్టలపైన డెమాన్‌స్టేషన్ నిర్వహించారు. పసుపు జరుగు అట్టలు ఆమేజాన్‌లో లభ్యమవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లకే పాత్రుడు, వీఏఏలు, వీహెచ్ఏ, ఎంపీఈవో సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ ముఖ్యం

కొయ్యూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): వరి సాగులో బాక్టీరియల్ ఎండు తెగులు, దోమపోటు నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఉమాదేవి సూచించారు. గురువారం మండలంలో మంప పంచాయతీ కించవానిపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పొలాలను పరిశీలించారు. వరిలో మొక్కలు ఎరుపు వర్ణంలోకి మారి బాక్టీరియల్ ఎండుతెగులు, దోమపోటు గమనించారు. ఈ నేపథ్యంలో పొలంలో యూరియా వాడకూడదన్నారు. ఈ తెగులు నివారణకు ఇమి డాచాల్‌ప్రిడ్ 0.25 మిలీ లీటర్లు మందు లీటరు నీళ్లలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నవంబరు 15 నాటికి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పశు వైద్యాధికారి పశు వ్యాధులపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ త్రినాధ పడాల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివరామరాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం


మర్రివాడలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు

కొయ్యూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును కేంద్ర క్వాలిటీ మోనటరింగ్ టీం పరిశీలించింది. గురువారం టీం లీడర్ సుధాకర్, ఏపీడీ శ్రీనివాసరావు, లోకేశ్‌తో కూడిన బృందం మండలంలో కొయ్యూరు, బూదరాళ్ళ, మర్రివాడ పంచాయతీల్లో పర్యటించింది. ఇందులో భాగంగా మర్రివాడలో గృహ నిర్మాణ లబ్ధిదారులను కలసి ప్రభుత్వ పరంగా నిధులు సక్రమంగా సకాలంలో తేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ల్యాండ్ లెవలింగ్ ట్రెంచ్‌ల నిర్మాణాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. బూదరాళ్ళ పంచాయతీలో పర్యటించి డ్వాక్రా సంఘాల మహిళలను కలసి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం మిస్తున్న రాయితీలపై ఆరా తీశారు.పలు అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజు, హౌసింగ్, పీఆర్ జేఈలు గోవిందు, రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై అవగాహన ఉండాలి: జెడ్పీటీసీ


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీపాలనపై వార్డు సభ్యులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు శిక్షణ తరగతులను జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. వార్డుల్లో సమస్యలను గ్రామ సభలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు వినియోగంపై చైతన్యం కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పి. ఆశాజ్యోతి, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్త నియామకం

చింతపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పంట శరీర ధర్మ (క్రాప్ ఫిజియాలజీ) శాస్త్రవేత్తగా డాక్టర్ డి. వెంకటేశ్ బాబు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో మహానంది వ్యవసాయ కళాశాల నుంచి ఇక్కడకు వచ్చారు. ఈమేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ సీదరి ఉజ్వలరాణిని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు.

మూడు మండలాల్లో కుండపోత

» వాయుగుండం కారణంగా నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో భారీ వర్షం » వరి పంటకు మేలు చేస్తుందని రైతులు ఆనందం


మాకవరపాలెంలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వాయుగుండం కారణంగా గురువారం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. నర్సీపట్నంలో ఎడతెరిపి లేకుండా నాలుగు గంటల పాటు ఏకధాటిగా పడడంతో ఎటుచూసినా జలమే కనిపించింది. ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు తెరిపివ్వలేదు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. 22వ వార్డు వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్ నుంచి బొంతు వీధికి వెళ్లే రోడ్డులో వర్షపునీరు నిలిచి పోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, శివపురం, బ్యాంక్ కాలనీ, ప్రశాంతి నగర్‌లలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరు మెయిన్ రోడ్డులో నిలిచి పోవడంతో జనం అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

మాకవరపాలెం : మండలంలో గురువారం ఉదయం సుమారు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఎండలు మండుతుండడంతో వరినారు మడులకు తడులు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ తరుణంలో వాయిగుండం కారణంగా మాకవరపాలెం, తామరం, భీమబోయినపాలెం, రామన్నపాలెం, రాచపల్లి గ్రామాల్లో వర్షం పడడంతో వరిపంట పొలాలకు నీరు చేరి ఊపిరి పోసినట్లైంది. అన్నదాతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండల వ్యాప్తంగా గురువారం వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, పాకలపాడు, రావణాపల్లి, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, గుండుపాల, ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట,చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో వాతావరణం చల్లబడింది.


కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో...

దుర్గమ్మ ఆలయ హుండీ లెక్కింపు

» 35 రోజులకు రూ.5,95,089 ఆదాయం రాక


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు

నర్సీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. జిల్లా దేవదాయశాఖ అధికారిణి కేఎల్ సుధారాణి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్, సీఐ రేణుకమ్మ, ఈవో సాంబశివరావు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ ప్రక్రియ సాగింది. 35 రోజులకు రూ.5,95,089ల ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు.

'పశువైద్య కేంద్రంలో మందుల కొరతపై దృష్టి'


ఆస్పత్రి ఆవరణ పరిశీలిస్తున్న ఏడీ

కృష్ణాదేవిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పశువైద్య కేంద్రాన్ని పాడేరు పశు సంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ చందక నరసింహులు గురువారం తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న పశువైద్య సేవలపై రైతుల ద్వారా తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత అంశాన్ని పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీషా ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సంయుక్త సంచాలకులు డాక్టర్ రాంబాబు, గొలుగొండ పశువైద్యాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు


కొమిరలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

గొలుగొండ, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) : కొమిర గ్రామంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యశాఖ ఏడీఏ డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడుతూ నట్టల నివారణ ద్వారా జీవాల్లో వ్యాధి నిరోధకశక్తి పెరిగి పిల్లల్లో మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. శరీర బరువు వృద్ధి చెందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ చందక నర్సింహులు, గొలుగొండ వైద్యాధికారి రమేష్, షిరీషా, టీడీపీ నాయకులు కర్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పుల సవరణకే గ్రామ సభలు



ధారపాలెంలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

మాకవరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వేలో తప్పిదాలను సరిదిద్దేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ అన్నారు. మండలంలోని తాడపాలలో గురువారం ఏర్పాటైన సదస్సలో మాట్లాడారు. గతంలో భూముల రీసర్వే పూర్తయినప్పటికీ కొంతమేర తప్పిదాలు జరిగాయన్నారు. అలాంటి సమస్యలు ఉంటే దరఖాస్తు చేస్తే పరిష్కారిస్తామని వివరించారు. దీంతో పలువురు రైతులు తమ భూములు అన్‌లైన్ లేవంటూ దరఖాస్తులు చేశారు. డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ జట్టి, వీఆర్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని ధారపాలెంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తులను అందజేశారు. భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలు సరిచేయాలని విన్నవించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రీ సర్వే అనంతరం భూ సమస్యలు ఉన్న వారు సభ దృష్టికి వారి సమస్యలను తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చైనులు, పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాకలపాడు సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్‌కు మెమో

» పింఛన్ల పంపిణీలో మిగుల నగదు ఇవ్వనందుకు ఇన్‌చార్జి ఎంపీడీవో ఆగ్రహం

గొలుగొండ, అక్టోబరు 17 : (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన నగదుపై ఎటువంటి సమాచారం తెలపని సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్‌కు మెమో జారిచేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పాకలపాడు పంచాయతీలో మొత్తం ఆరు వందలు పింఛన్లు ఉండగా, సెప్టెంబరుకు సంబంధించిన పింఛన్లు అక్టోబరు నెలలో పంపిణీకి చర్యలు చేపట్టారు. అయితే ఈ ఆరు వందల పింఛన్లలో 578 లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. మిగిలిన నగదుపై సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ కె.అశోక్ కుమార్ ఈనెల ఐదో తేదీలోగా ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే ఆ నగదు ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదు. సరికగా మండల పరిషత్ అధికారులకు తెలియజేయక పోవడంతో ఆయనకు మెమో జారీ చేసినట్టు చెప్పారు. ఈ అంశంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవో ఫోన్‌లో వివరణ కోరగా, తనకు ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో విశాఖపట్నం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నట్టు తెలిపారని తెలిపారు.

'గ్రామస్థాయిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం'

మాకవరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు ఏర్పాటైన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. ప్రతి వార్డు సభ్యుడు పంచాయతీ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు మాట్లాడుతూ సమష్టి కృషితోనే గ్రామాల ప్రగతి సాధ్యమన్నారు. ఈ దిశగా అధికారులు, పంచాయతీల పాలకులు కృషిచేయాలన్నారు. ప్రధానంగా వార్డు సభ్యులు విధులు, అధికారాలను గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'

నర్సీపట్నం, అక్టోబరు 17 : ప్రైవేటు మద్యం దుకాణాలలో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఎంఆర్‌పీ కంటే అధికంగా మద్యం విక్రయించడం నేరమన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో 20,809 మద్య బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొత్తగా 21 ప్రైవేటు మద్యం దుకాణాలకు గాను 20 మంది మద్యం విడిపించుకున్నారని తెలిపారు. 17 షాపులు తెరుచుకొని అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. శుక్రవారం మరో మూడు మద్యం షాపులు తెరచుకోనున్నాయన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి జయంతిని గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్.ప్రాన్సిస్, శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి దమయంతి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లు అప్పారావు, బాబీ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే గ్రామ సభల లక్ష్యమని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. గురువారం కరకలో నిర్వహించిన రెవెన్యూ సభలో ఆమె మాట్లాడుతూ.. రైతులు ఇబ్బందులను తెలుసుకుని ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఫిర్యాదు చేసిన ప్రతి రైతుకు రశీదు ఇస్తామన్నారు. ఈ సభలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, ఎంఆర్ఐ శ్రవణ్, వీఆర్వోలు జేవీ.రమణ, ఏ.తులసీరావు, ఎస్.రమణ, సర్వేయర్లు వినోద్, అపర్ణ, గోవిందు, సాయి, సంతోషం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పినకోట ఫీడర్‌లో గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈఈ కర్రి శంకరరావు గురువారం తెలిపారు. పినకోట ఫీడర్‌లో ఉన్న వాలాబు, శ్రీరాంపురం, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలో గ్రామాలకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మితే చర్యలు : సీఐ

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుచ్చెయ్యపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు మద్యం అమ్మితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బాపునాయుడు హెచ్చరించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అధిక ధరలపై మందుబాబుల ఆగ్రహం' వార్తకు ఆయన స్పందించారు. బుచ్చెయ్యపేట కూడలిలో మద్యం షాపు యాజమాన్యం మద్యం అధిక ధరలకు విక్రయించడంపై విచారణ చేయగా, తొలిరోజు కావడంతో ధరలపై అవగాహన లోపంతో అధిక ధరలకు తాము అమ్మకాలు చేపట్టినట్టు యాజమాని తెలిపారన్నారు. ఎమ్మార్పీ ధరలపై షాపు యాజమానికి అవగాహన కల్పించామన్నారు. బడికి, ఆలయాలకు 100 మీటర్ల లోపు మద్యం షాపులు ఏర్పాటు చేయరాదన్నది ప్రభుత్వ నిబంధన అని సీఐ బాపునాయుడు తెలిపారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నసమారాధన

రావికమతం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధనను డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మిడి సత్యదేవ ప్రారంభించారు. మొదటి వారం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లేశ్వరరావు రమా దంపతులు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇకపై ప్రతి గురువారం క్రమం తప్పకుండా అన్న సమారాధనను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన రైతులు నిరసన

చీడికాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం గుంటుకొత్తూరు గిరిజన రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోనాం శివారు గుంటుకొత్తూరు గ్రామానికి చెందిన గిరిజన సంఘం నాయకుడు జన్ని లక్ష్మణరావు మాట్లాడుతూ, తరతరాలుగా తాము సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చారని, దీన్ని సాగుచేసుకొని జీవిస్తున్నామన్నారు. అయితే అక్కడ ఎటువంటి భూములు లేకుండా కొంతమందికి పట్టాలు ఇవ్వడంతో భూస్వాములు వచ్చి తమను అడ్డుకొంటున్నారన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు, రైతులు పాల్గొన్నారు.

గాదిరాయిలో పశువైద్య శిబిరం

మాడుగుల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాదిరాయిలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 36 పశువుల్లో గర్భకోశ వ్యాధులకు, 12 ఎదకు రాని పశువులకు, 8 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించినట్టు పశువైద్యాధికారి మణి లక్ష్మణ్ తెలిపారు. 30 పెయ్యిలకు నట్టల నివారణ మందులు, 40 పశువులకు సాధారణ చికిత్సలు చేశామన్నారు. ఈ శిబిరం ద్వారా 76 మంది పాడి రైతులకు లబ్ధిచేకూరిందని తెలిపారు. 25 మంది పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, టీడీపీ మండల అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు, వీఎల్‌వో సత్యం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాడుగులలో వర్షం

మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాడుగులలో గురువారం భారీ వర్షం కురిసింది. తెల్లవారి జాము నాలుగు గంటల సమయంలో మోస్తరు వర్షం కురిసిన అనంతరం తెరిపినిచ్చింది. అనంతరం మధ్యాహ్నాం ఒంటిగంటన్నర సమయంలో భారీగా వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. వాతావరణం చల్లబడింది.

'పంచాయతీ పాలన విధులపై అవగాహన అవసరం'

దేవరాపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలన విధులపై పాలక సభ్యులకు అవగాహన ఉండాలని ఎంపీడీఓ సువర్ణరాజు అన్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన గురువారం పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పరిపాలన, విధులపై శిక్షణ ఇచ్చారు. రెండు రోజులుపాటు ఈశిక్షణ జరుగు తుందన్నారు. ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు శిక్షణ ఇస్తున్నామన్నారు. పంచాయతీ బాధ్యతలు, విధులు నిర్వహణ, అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర గురించి శిక్షణ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, తది తరులు పాల్గొన్నారు.

పైసా బిల్లు చెల్లించలేదు

» గోకులం షెడ్ల లబ్ధిదారులు ఆరోపణ
» విచారణ అధికారుల వద్ద గోడు వినిపించిన బాధితులు


కొమిర రైతులతో మాట్లాడుతున్న విచారణ అధికారి

రావికమతం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి గోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తి చేశామని, పైసా బిల్లు ఇంతవరకు ప్రభుత్వం నుంచి అందలేదని పలువురు లబ్ధిదారులు ఆరోపించారు. గురువారం గుమ్మళ్లపాడు, కొమిర, గర్నికం గ్రామాల్లో గోకులం షెడ్లు బిల్లులు అందని లబ్ధిదారులను స్పెషల్ సోషల్ ఆడిట్ ఆఫీసర్లు డి.రాజేంద్ర, వరప్రసాద్ విచారించారు. వారి వద్ద నుంచి లిఖితపూర్వకంగా వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా గోకులాలు నిర్మించిన లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఐదు నుంచి పది వేలు రూపాయలు ఇచ్చారని కొందరు చెప్పగా.. మరికొందరు మెటీరియల్ రేకులు, ఆరు ఇనుప పైపులు మాత్రమే ఇచ్చారని చెప్పడంతో విచారణాధికారులు అవాక్కయ్యారు. 2018లో టీడీపీ ప్రభుత్వం హయాలంలో మండలంలో కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, పి.పొన్నవోలు, మేడివాడ, గర్నికం, రావికమతం, గుమ్మళ్లపాడు, చినపాచిల, మత్స్యపురం తదితర గ్రామాలలో 41 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అప్పట్లో వీటి నిర్మాణ బాధ్యతను సాయి బాలాజీ ఎంటర్ ప్రైజెస్‌కి ప్రభుత్వం అప్పగించింది. రైతులు నిర్మించిన షెడ్లకు నాలుగు విడతలుగా బిల్లులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, సాయిబాలాజీ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ యాజమాన్యం కుమ్మక్కై.. రైతుల బిల్లుల మొత్తాలను సాయి బాలాజీ ఎంటర్ ప్రైజెస్ ఖాతాకు బదలాయించారు. గోకులం షెడ్లకు బిల్లులు వస్తాయని ఆశతో ఎదురుచూసిన రైతులకు రాకపోవడంతో పలు మార్లు ఆందోళన చేశారు. ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదేళ్ల గోకులం రైతులను పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోకులం షెడ్లపై, నిధుల దుర్వినియోగంపైన సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్పెషల్ సోషల్ ఆడిట్ అధికారులు రైతులు నిర్మించిన షెడ్లు వద్దకు వెళ్లి విచారణ చేస్తున్నారు. నిర్మించిన షెడ్లకు బిల్లు చెల్లించారా? లేదా? ఆరా తీశారు. ఒకవేళ బిల్లు చెల్లిస్తే ఎంత మేరకు ఇచ్చిందీ వంటి వివరాలు సేకరిస్తున్నారు. అలాగే రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల జెరాక్స్‌లతోపాటు వారి నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారు.దీంతో రైతులు అప్పుల పాలైయ్యామంటూ గోడు వినిపించుకున్నారు. ఈ విషయమై విచారణ అధికారి రాజేంద్రను వివరణ కోరగా.. తమ విచారణ పూర్తి కాలేదని, షెడ్లు నిర్మాణాలు చేసిన రైతులను విడివిడిగా కలిసి విచారణ చేస్తున్నామన్నారు. కొంత మందికి బిల్లు చెల్లించారని, మరికొందరికి బిల్లు చెల్లింపు జరగలేదని పేర్కొన్నారు. అంతా గందరగోళంగా ఉందన్నారు. సమగ్ర దర్యాప్తు చేసిన తర్వాత వాస్తవాలు వెల్లడిస్తామన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి : ఆర్డీఓ


రత్నంపేటలో సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీ రమణ

రోలుగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ వీవీ రమణ ఆదేశించారు. గురువారం బీజేపేట రెవెన్యూ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ సదస్సును రత్నంపేట సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వీవీ రమణ మాట్లాడుతూ.. ఈ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలి రోజు నిర్వహించిన సదస్సులో 8 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 51 ఫిర్యాదులు

రావికమతం: మండల కేంద్రంలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో వివిధ భూ సమస్యలపై 51 మంది రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.వెంకట రమణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో తమకున్న భూమిని తక్కువగా నమోదు చేశారన్నారు. కొన్నింటికి ఫోన్ నంబర్లు లింక్ చేయలేదని, భూమి ఒక్కరిదైతే సాగు వేరొకరిపేరు నమోదు జరిగిందని, సర్వే నంబర్లు తప్పుగా పడ్డాయంటూ ఫిర్యాదు అందాయి.

మార్చిలోగా పూర్తి చేసిన ఇళ్లకే బిల్లులు : ఎంపీడీవో

రోలుగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్చిలోగా పూర్తి చేసిన ఇళ్లకు మాత్రమే బిల్లులు మంజూరవుతాయని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం నూతన ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. గతంలో ఎన్టీఆర్ పథకంలో మధ్యలో ఆగిపోయిన ఇళ్లకు సర్వే పూర్తిచేసినట్టు తెలిపారు. మూడేళ్ల నుంచి కుసర్లపూడి జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ మద్దు అప్పలనాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వైద్యాధికారులు సునీత, శిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌బాబు, ఉపాధి ఏపీవో ఈశ్వరరావు, ఎంఈఓ జగ్గారావు, హౌసింగ్ ఏఈ గణేష్ తమ శాఖల ప్రగతి నివేదికలను సభకు వినిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ పాల్గొన్నారు.

సకాలంలో మందులు వాడితే క్షయను నివారించవచ్చు

» రావికమతం వైద్యాధికారి శ్రీనివాస్

రావికమతం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. మేడివాడలో గురువారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ దగ్గు, కఫం అధికంగా వస్తే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తనఖీలు చేయించుకోవాలన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి అవసరమైన మందులు వాడితే ఇది పూర్తిగా నయమైయ్యిపోతుందన్నారు. అనంతరం 25 మంది నుంచి శాంపిల్స్ సేకరించారు. అనంతరం గర్నికం కేజీబీవీలో కిషోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చోడవరం సీహెచ్‌సీ గైనికాలజిస్ట్ డాక్టర్.స్మృతి, సీహెచ్ఓ కె.హేమ సుందర్రావు, ఎస్‌టీఎల్ఎస్ సత్తిబాబు, ఎస్టిఎస్ కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల అభివృద్ధిలో రెడ్డిదే కీలకపాత్ర

» రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు


సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

చీడికాడ, అక్టోబరు 17: మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిలో మాస్టర్, మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణదే కీలకపాత్ర అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తనను రెడ్డి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీలోకి తీసుకువచ్చారన్నారు. ఆయన అడుగుజాడల్లో ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. రెడ్డి సత్యనారాయణ పేరును ఏదో ఒక పథకానికి పెట్టాలని నిర్ణయించుకున్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రెడ్డి రాము, రెడ్డి జయమ్మ, ఎంపీడీవో హేమసుందర్, అధికారులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో అవినీతికే అధిక ప్రాధాన్యం

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


ఎమ్మెల్యే బండారుని సన్మానిస్తున్న పెదగోగాడ టీడీపీ నాయకులు

చీడికాడ, అక్టోబరు 17: వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కన్నా అవినీతికే అధిక ప్రాధాన్యం ఇచ్చారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పల్లె పండుగలో భాగంగా మండలంలోని 11 పంచాయతీల్లో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కనీసం సాగునీటి సమస్యకు ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదన్నారు. కోనాం జలాశయం మరమ్మతులకు కోటి రూపాయలు మంజూరు చేయించానన్నారు. అలాగే చీడికాడ మండలంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని, దీన్ని నివారించేందుకు జిల్లాఅధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మట్టా అప్పారావు, కొల్లి సూరినాయుడు, కె.భాగ్యలక్ష్మి, చలుగు ఈశ్వరమ్మ, శీరంరెడ్డి లక్ష్మి, బండారు వెంకటలక్ష్మి, బీశ్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు పాత్రిన సింహాచలంనాయుడు, కుచ్చు కళావతి, టీడీపీ నాయకులు గండి ముసలినాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, బండారు దయాకర్ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు.

గ్రామాలభివృద్ధికి చర్యలు తీసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యం పనులు చేపట్టేందుకు పంచాయతీ అధికారులు కృషి చేయాలని ఈవోపీఆర్డీ కె. కరుణాకర్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా గ్రామాల్లో రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చికాకు పెట్టే మెనోపాజ్!

మహిళల్లో రుతుక్రమం నిలిచిపోయే దశలో ఇబ్బందులు

వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో మార్పులు అనివార్యం. ఆ సమయంలో కొన్నిరకాల ఇబ్బందులు వేధిస్తాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ దశలో చిరాకు, కోపం, డిప్రెషన్ తదితర సమస్యలు ఎదురవుతాయి. వాటిపై సరైన అవగాహన ఉంటే సమర్థంగా ఎదుర్కొనే వీలుంటుంది. ఆందోళన చెందితే సమస్యలు అధికమవడమే కాకుండా మరిన్ని అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదముంటుంది.

- అనారోగ్య సమస్యలు వెంటాడే అవకాశం
- అవగాహన లేక అనేకమందిలో ఆందోళన
- నివారణ మార్గాలతో సమస్యలకు చెక్
- యోగా, మెడిటేషన్, ఆహార అలవాట్లలో మార్పులు తప్పనిసరి
- నేడు వరల్డ్ మెనోపాజ్ డే



విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో మెనోపాజ్ దశ అత్యంత కీలకమైనది. ఈ దశలో అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటారు. మెనోపాజ్ అంటే మహిళల్లో (పీరియడ్స్) రుతుక్రమం పూర్తిగా ఆగిపోవడం. రుతుక్రమం జరగడానికి, మహిళలకు సంబంధించిన ఇతర లక్షణాలకు ఈస్ట్రోజన్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. రుతుక్రమం ఆగిపోయిన తరువాత ఈ హార్మోన్ తగ్గిపోతుంది. దీనివల్ల వివిధ సమస్యలు వేధిస్తాయి. వీటిపై మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 18న వరల్డ్ మెనోపాజ్ డే నిర్వహిస్తున్నారు. ప్రతి మహిళ జీవితంలో మెనోపాజ్ సర్వసాధారణం. అయితే ఈ దశలో ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహనలేక సతమతమవుతుంటారు. ఈ దశలో ఎదుర్కొనే సమస్యల్లో హార్ట్ ఫ్లాష్ అత్యంత కీలకమైనది. ఈ లక్షణంతో బాధపడే మహిళలు ఫ్యాన్ కింద ఉన్నా, ఏసీ రూముల్లో ఉన్నా తీవ్రమైన చెమటతో బాధపడుతుంటారు. ఒళ్లు వేడిగా ఉంటుంది. దీనివల్ల రోజువారీ చేసే పనులపై ఆసక్తి చూపరు. మూడ్‌లో తరచూ మార్పులు వస్తుంటాయి. విపరీతమైన కోపం, యాంగ్జైటీ లక్షణాలుంటాయి. దీనివల్ల కుటుంబ కలహాలు మొదలవుతుంటాయి. కొందరిలో డిప్రెషన్ వేధిస్తుంది. నిద్ర పట్టకపోవడం, ఎముకల సామర్థ్యం తగ్గిపోతుంది. యూరినరీ సంబంధిత సమస్యలు వేధిస్తాయి. అవగాహన లేక వాటిని భరిస్తూనే ఉంటారు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం, మందులను వేసుకోవడం ద్వారా ఈ సమస్యలకు కొంతవరకు చెక్ చెప్పే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

నివారించే మార్గాలివే..

మెనోపాజ్ దశలో ఎదురయ్యే సమస్యలను నివారించేందుకు కొన్ని మార్గాలున్నాయి. ఇందుకోసం పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. తగ్గిపోయిన ఎముకల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కాల్షియం, విటమిన్ డి టాబ్లెట్లు వేసుకోవాలి. ఒత్తిడి, యాంగ్జైటీ, డిప్రెషన్ నుంచి బయటపడేందుకు యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలి.మెనోపాజ్ దశలో ఎదురయ్యే ఇబ్బందులు పట్ల అవగాహన ఉన్నప్పుడే ఈ జాగ్రత్తలను పాటించేందుకు అవకాశంఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

అవగాహన లేకఇబ్బందులు

- డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్, గైనకాలజీ, కేజీహెచ్



మెనోపాజ్ దశ పట్ల అవగాహన లేక చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇందుకోసం కేజీహెచ్‌లో ప్రత్యేకంగా మోనోపాజ్ క్లినిక్ నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ కనీసం 20 మంది మహిళలు వస్తుంటారు. ఆయా లక్షణాలతో బాధపడే వారిలో దాదాపు 80 శాతం మందికి కారణం కూడా తెలియడం లేదు. కొన్ని సమస్యలకు ఆహార అలవాట్లు, యోగా, మెడిటేషన్ ద్వారా చెక్ చెప్పవచ్చు. మెనోపాజ్ దశకు చేరిన వారిలో కొన్నిరకాల కేన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది. కాబట్టి క్లినిక్‌కు వచ్చిన మహిళలకు ప్యాప్స్మియర్, మామోగ్రఫీ టెస్ట్ నిర్వహించి సర్వైకల్, రొమ్ము కేన్సర్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నాం.

హార్మోనల్ థెరపీతో మేలు

- డాక్టర్ టి.రాధ, విశ్రాంత ప్రిన్సిపాల్, ఆంధ్ర మెడికల్ కళాశాల



మెనోపాజ్ దశకు చేరిన మహిళల్లో ఇబ్బందులు వస్తుంటాయి. వీటినుంచి ఉపశమనం పొందేందుకు గతంలో కొన్నాళ్లపాటు హార్మోనల్ థెరపీ కింద ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ వంటి హార్మోన్లను ఇచ్చేవారు. అయితే 2002లో ఒక స్టడీ వచ్చింది. హార్మోన్ థెరఫీ వల్ల ఎక్కువ మంది మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు పెరగడంతోపాటు స్ట్రోక్ రిస్క్ పెరుగుతోందని తేలింది. కొందరిలో రొమ్ము కేన్సర్ ముప్పు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఈ థెరపీని నిలిపేశారు. ఆయా లక్షణాలతో బాధపడుతూ 60 ఏళ్లలోపు మెనోపాజ్ దశలో ఉన్న వారికి మాత్రమే హార్మోనల్ థెరపీ ఇస్తున్నారు. వైద్యుల సలహాపై ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ ఇస్తే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. 1984 నుంచి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, ఇంటర్నేషనల్ మెనోపాజ్ సొసైటీ మెనోపాజ్ డే నిర్వహిస్తూ వస్తోంది. ప్రకృతి సిద్ధంగా జరిగే మహిళల్లో సహజ ప్రక్రియ వల్ల ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పించడమే దీని ధ్యేయం.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ విజ యకృష్ణన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామ కథను రామాయణ మహాకావ్యంగా రచించిన వాల్మీకి కారణజన్ముడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌వో దయానిధి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారుకు గాయం



తురువోలు ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యం చేయించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, అక్టోబరు 17: మండలంలోని తురువోలు గ్రామంలో జరుగుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి.. వీధుల్లో పర్యటిస్తున్న సమయంలో ఒకచోట కాలు జారి కింద పడబోయారు. పక్కనే ఉన్న టీడీపీ నాయకులు అప్రమత్తమై ఆయనను పట్టుకొన్నారు. ఈ సందర్భంగా బండారు కాలి బొటన వేలుకి గాయమైంది. అదే గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం యథావిధిగా పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నర్సీపట్నంలో 20న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



చెట్టుపల్లి హైస్కూల్ పీడీ దేవికి పతకాలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ పట్నం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 20వ తేదీన స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రదానం చేసే పతకాలను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వితరణ చేశారు. ఈమేరకు పసిడి, రజత, కాంస్య పతకాలను గురువారం చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ఫిజికల్ డైరెక్టర్ దేవికి ఆయన అందజేశారు. ఇక్కడ నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీడీ తెలిపారు.

పెందుర్తి-అరకు రోడ్డు నాలుగు లేన్లుగా విస్తరణ

పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మీదు బొడ్డవర జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులకు మోక్షం లభించనున్నది. సుమారు 45 కిలోమీటర్ల రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. దీనికి ఎన్‌హెచ్ 516బీ అని నంబర్ ప్రకటించారు. బొడ్డవర వద్ద ఎన్‌హెచ్ 516ఈని కలిపేలా రహదారిని అభివృద్ధి చేయనున్నారు. భూ సేకరణ, పునరావాసం, నిర్మాణానికి రూ.956.21 కోట్ల విడుదలకు ఆమోదం తెలుపుతూ కేంద్ర రహదారులు, రవాణా శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. పనులకు సంబంధించి గత నెలలో టెండర్లను ఆహ్వానించి కాంట్రాక్టర్‌ను కూడా ఖరారు చేశారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం



భగవాన్ (ఫైల్ ఫొటో)

రావికమతం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువున్న విద్యార్థి అదృశ్యమైనట్టు గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ రఘువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గర్నికం గ్రామానికి చెందిన కేశంశెట్టి సత్తిబాబు కుమారుడు భగవాన్ (14) పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది.. బంధువులు, స్నేహితులను వాకబు చేశారు. భగవాన్ ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సత్తిబాబు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు నలుపు చారల టీ షర్ట్, హాఫ్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 9440904214, 8106187952, 9963671538 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని ఎస్ఐ కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	149.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

రైతులకు అందుబాటులో ఉండాలి

- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ ఆదేశం





మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన వ్యవసాయశాఖ అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా పొలం బడి, పొలం పిలుస్తోంది, పీఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. రైతులకు కావాల్సిన సమాచారం, సహాయం వెంటనే అందించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆమె ఆదేశించారు. రైతుల రిజిస్ట్రేషన్, ఈకేవైసీ శతశాతం పూర్తి చేయాలన్నారు. పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, రైతులను భాగస్వాములను చేసి నూతన సాగు పద్ధతులపై అవగాహన పెంచాలన్నారు. వరి పంట మినహా మిగిలిన పంటల లక్ష్యాలు పూర్తి కావడం లేదని, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట సాగు దశలో ఉందని, తదుపరి సాగు చేసే రబీ పంటకు కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రచారం కల్పించి ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న పాల్గొన్నారు

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్లలో టి.అర్జాపురం విద్యార్థులు



రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకుఎంపికైన విద్యార్థులు

రావికమతం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసిన జట్లలో తొమ్మిది మంది చోటు సంపాదించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాల క్రీడా పోటీలు ఈ నెల 15న చోడవరం మండలం గోవాడ ఉన్నత పాఠశాలలో జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో టి.అర్జాపురం ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14 జట్టులో టి.అర్జాపురం పాఠశాలకు చెందిన ఎస్.మహంత్, ఆర్.ప్రవీణ్‌కుమార్, జి.లోకేశ్, ఆర్.శృతి, వి.గిరిజ, ఎం,భారతి, ఎ.లక్ష్మీకుమారి వున్నారు. నవంబరులో అన్నమయ్య జిల్లా అంగులూరులో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ రమేశ్‌నాయుడు తెలిపారు. అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎం.రిషిత, ఆర్.ప్రసాద్ ఎంపికయ్యారన్నారు. వీరు నవంబరులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సమాచార బోర్డు నిర్వహణలో నిర్లక్ష్యం

- అధికారులు బదిలీ అయినా మారని పేర్లు



సమాచార బోర్డులో బదిలీ అయిన అధికారుల పేర్లే దర్శనమిస్తున్న దృశ్యం

పరవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు బదిలీ అయి 15 రోజులు కావస్తున్నా మండల పరిషత్ కార్యాలయంలోని సమాచార బోర్డులో మాత్రం పాత అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఫోన్ నంబర్లు కూడా మార్చలేదు. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారంతా బోర్డుపై ఉన్న నంబరుకు ఫోన్ చేస్తుండడంతో అటు నుంచి తాము బదిలీపై వెళ్లిపోయినట్టు సమాచారమిస్తున్నారు. దీంతో స్థానికులు కంగుతింటున్నారు. ఎంపీడీవోగా ఎస్‌డీ శ్యామ్‌సుందర్ బాధ్యతలు స్వీకరించి సుమారు 15 రోజులు కావస్తుంది. సమాచారం బోర్డుపై మాత్రం ఆయన పేరు ఎక్కడ రాయలేదు. అలాగే పంచాయతీ విస్తరణ అధికారి కె. ధర్మారావు బాధ్యతలు స్వీకరించి పది రోజులు కావస్తుంది. కానీ సమాచార బోర్డు మీద మాత్రం గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిపోయిన కె.రమేశ్‌నాయుడు పేరు దర్శనమిస్తుంది. అలాగే మండల ఇంజనీర్ జి.సత్యరామారావు పదవీవిరమణ చేయడంతో కొత్తగా స్వాతి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆమె పేరు కూడా బోర్డుపై రాయలేదు. దీంతో వివిధ పనులపై వచ్చేవారంతా పాత అధికారులకు ఫోన్లు చేసి కంగుతినడం తమ వంతు అయింది. మండల పరిషత్ అధికారులు తక్షణమే కలుగజేసుకుని సమాచార బోర్డులో ప్రస్తుత అధికారుల పేర్లను చేర్చాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన పెరగాలి

- న్యూరాలజీ వైద్యుల సదస్సులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గుండె జబ్బులతో సమానంగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయని, కానీ అవగాహన పెరగడం లేదన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఆధ్వర్యంలో 31వ జాతీయ సదస్సు నగరంలోని నోవాటెల్‌లో జరుగుతోంది.

రెండో రోజు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బ్రెయిన్ స్ట్రోక్ కారణాలు, చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్ట్రోక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించాలని సూచించారు. సదస్సులో దేశ, విదేశాల నుంచి రెండు వేల మందికిపైగా న్యూరాలజీ వైద్యులు పాల్గొని చర్చించడం గొప్ప విషయమన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ (ఐఏఎన్) ప్రెసిడెంట్ డాక్టర్ దేబాశిష్‌చౌదరి మాట్లాడుతూ న్యూరాలజీలో భిన్నమైన సమస్యలున్నాయన్నారు. ఆయా డివిజన్లలో ఉత్తమ పరిశోధనలు చేసిన వారికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందించాలన్నారు. అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ యు.మీనాక్షి సుందరం మాట్లాడుతూ న్యూరాలజీ వైద్యులు పరిశోధనలపైనా దృష్టి సారించాలన్నారు.

సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సెక్రటరీ డాక్టర్ ఎస్.గోపి, వైద్యులు డాక్టర్ సత్య వరప్రసాద్, డాక్టర్ ఎం మధుసూదన్‌బాబు, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. రెండో రోజు సదస్సులో మూర్ఛ వ్యాధి, బ్రెయిన్‌స్ట్రోక్, న్యూరో సమస్యలకు అధునాతన వైద్య పద్ధతులు, జెనిటిక్ ఇష్యూస్‌పై చర్చించారు.

ఎన్టీఆర్ వైద్యాలయానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం వితరణ



వైద్యాలయానికి అందజేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి డబ్ల్యూడీజేఎం కంపెనీ రూ.25 లక్షలు విలువ చేసే అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్ రెండు ఆపరేటర్లను గురువారం వితరణగా అందజేసింది. కంపెనీ హెచ్‌ఆర్ పల్లవి శివన్న వీటిని సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసి ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గైనిక్ వైద్యులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు చోద్యం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, సెపాక్ తక్రా పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీనివాసరావు, పీఈటీ కుందూరు నూకరాజు తెలిపారు. బుధవారం దేవరాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పి.గీతిక, సెపాక్‌తక్రా పోటీల్లో వై.రేవతి, టి.మనోజ్ సత్తాచాటారని చెప్పారు.

సుజల స్రవంతి పనులు వెంటనే చేపట్టాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

చోడవరం, అక్టోబరు 17: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో.. ప్రత్యేకించి అనకాపల్లి జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి వనరుల నిర్వహణకు ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో వేలాది ఎకరాలకు నీరు అందక పంటలు సరిగా పండడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి జిల్లాలో సాగునీటి వనరులను అభివృద్ధి చేయడంతోపాటు, రిజర్వాయర్లు, కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

మద్యం దుకాణాలకు అవాంతరాలు

... 5వ పేజీ తరువాయి

తీర్మానాన్ని ఎక్సైజ్ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రంపచోడవరం పరిధిలో 10, చింతూరు పరిధిలో 8 మద్యం దుకాణాలకు గ్రామసభ తీర్మానాలు లేకపోవడంతో మొత్తం 18 దుకాణాలు ప్రారంభం కాలేదు.

పాడేరు ఏజెన్సీ పరిధిలో వసతి సమస్య

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో నూతన మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు వసతి సమస్య ఏర్పడింది. దీంతో పాడేరు, అరకులోయ, చింతపల్లిలో మొత్తం 22 షాపులకు గాను గురువారం నాటికి 12 మాత్రమే ప్రారంభంకాగా, మరో 10 ప్రారంభం కాలేదు. పాడేరులోని 4 షాపులకు 2, పెదబయలులో రెండుకు ఒకటి, ముంచంగిపుట్టులో ఒకటి ప్రారంభం కాగా, వసతి లేక జి.మాడుగులో ఒకటి, పెదబయలులో రెండోది ప్రారంభం కాలేదు. అలాగే అరకులోయలో వసతి సమస్య కారణంగా నాలుగింటికి రెండు మాత్రమే ప్రారంభమయ్యాయి. హుకుంపేట, అనంతగిరిలో ప్రారంభంకాగా, డుంబ్రిగుడలోనూ వసతి లేక మొదలు కాలేదు. చింతపల్లిలోని మూడు దుకాణాలు ప్రారంభంకాగా, కొయ్యూరులో ఒకటి, జీకేవీధిలో రెండు వసతి లేక ప్రారంభం కాలేదు. ఇప్పటికి ప్రారంభంకాని మద్యం దుకాణాలు ఒకటి రెండ్రోజుల్లో మొదలవుతాయని తెలుస్తుంది. ఈ దఫా మద్యం దుకాణాలు సిండికేట్‌లకు కాకుండా కొత్త వ్యక్తులకు దక్కడంతో సకాలంలో వసతిని సమకూర్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వైన్‌షాపుల ప్రారంభం సైతం ఆలస్యమైంది. అయితే ప్రారంభమైన దుకాణాల వద్ద మాత్రం రద్దీగానే ఉంటున్నది.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, BANKUPALLI CHITANYA (Old Name), S/o. Bankupalli Ganapathi Prasadam, resident of 58-9-27, New Karasa, NAD Post, Visakhapatnam. Change my name from BANKUPALLI CHITANYA (Old Name) to BANKUPALLI CHAITANYA (New Name) henceforth I am being called as BANKUPALLI CHAITANYA (New Name), S/o. Bankupalli Ganapathi Prasadam for all purposes.
AJV_204814

CHANGE OF NAME

★ I, SASMITA KUMARI PADHY (Old Name), W/o. Karunakar Padhy, resident of F.No.402, Sri Santhi Landmark South Block, Madhavadhara, Marripalem, Visakhapatnam. Change my name from SASMITA KUMARI PADHY (Old Name) to SASMITA PADHY (New Name) henceforth I am being called as SASMITA PADHY (New Name), W/o. Karunakar Padhy for all purposes.
AJV_204815

CHANGE OF NAME

★ I, RAAVI RAJESWARI (Old Name), W/o. Raavi Mutyala Raju, resident of 4-57, BC Colony, P.Agraharam, Thondangi, Kakinada. Change my name from RAAVI RAJESWARI (Old Name) to RAAVI RAJARAJESWARI (New Name) henceforth I am being called as RAAVI RAJARAJESWARI (New Name), W/o. Raavi Mutyala Raju for all purposes.
AJV_204816

CHANGE OF NAME

★ I, DOSURI KUMARI (Old Name), W/o. Dosuru Varaha Venkata Eswara Rao, resident of 2-22, Rayapurajupeta, Chodavaram, Anakapalli. Change my name from DOSURI KUMARI (Old Name) to DOSURU KUMARI (New Name) henceforth I am being called as DOSURU KUMARI (New Name), W/o. Dosuru Varaha Venkata Eswara Rao for all purposes.
AJV_204817

CHANGE OF NAME

★ I, DINESH HANDA (Old Name), resident of Sterlingh Heights apts., Rednam Gardens, Visakhapatnam. Change my name from DINESH HANDA (Old Name) to DINESH KUMAR HANDA (New Name) henceforth I am being called as DINESH KUMAR HANDA (New Name) for all purposes.
AJV_204820

PASSPORT LOST

I, SANTOSHI VISHNU VANDANA GUNTURU, W/o. Gunturu Srinivas, R/at 9-5-53/2, Shivajipalem, L.B. Colony, Visakhapatnam. I have lost my Son GUNTURU ADITYA VARDAN Passport bearing No. C2763789 issued by Regional Passport Officer, Visakhapatnam, issued on 24-09-2024, while I sent to Bangalore by DTDC courier on 08-10-2024. If any found please contact : 8977877797

For Advertisement Contact :
9963231176
9966165093

CHANGE OF NAME

I, BISETTY LAKSHMI (Old Name), Resident of D.No. 6-40-9, TVN Colony, Drivers Colony, Gajuwaka, Visakhapatnam. Change my name from BISETTY LAKSHMI (Old Name) to BHEESETTI LAKSHMI (New Name) henceforth I am being called as BHEESETTI LAKSHMI (New Name) for all purposes.

CHANGE OF NAME

★ I, DUSURI SIVA KUMAR (Old Name), S/o. Dosuru Varaha Venkata Eswara Rao, resident of 2-22, Rayapurajupeta, Chodavaram, Anakapalli. Change my name from DUSURI SIVA KUMAR (Old Name) to DOSURU SIVA KUMAR (New Name) henceforth I am being called as DOSURU SIVA KUMAR (New Name), S/o. Dosuru Varaha Venkata Eswara Rao for all purposes.
AJV_204818

CHANGE OF NAME

★ I, DUSURI VARAHA VENKATESWARA RAO (Old Name), S/o. Dosuru Sambamurthy, resident of 2-22, Rayapurajupeta, Chodavaram, Anakapalli. Change my name from DUSURI VARAHA VENKATESWARA RAO (Old Name) to DOSURU VARAHA VENKATA ESWARA RAO (New Name) henceforth I am being called as DOSURU VARAHA VENKATA ESWARA RAO (New Name), S/o. Dosuru Sambamurthy for all purposes.
AJV_204819

PLOTS FOR SALE

» VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, మన్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, APCRDA ప్లాట్స్ చ.గ. 1900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర. 93985 76997.
AJB_110

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి